సాక్షి
కర్నూలు
శుక్రవారం । 10 । జనవరి । 2025



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళా వేదికపై గురువారం కడపకు చెందిన సాయినటరాజ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



మంత్రాలయంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామి మూలబృందావనంకు పూజలు నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1.633
ప్రస్తుతం	: 1,624.16
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 73.789
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 0
అవుట్ ఫ్లో	: 9,390

న్యూస్‌రీల్

తిరుపతి ఘటన ప్రభుత్వానిదే బాధ్యత

● వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



కర్నూలు (టౌన్): 'తిరుపతి ఘటన ముమ్మాటికీ మానవ తప్పిదమే. ప్రపంచ వ్యాప్తంగా తిరుమల ప్రతిష్ట దెబ్బతింది. తిరుమలలో వైకుంఠ ఏకాదశికి లక్షలాది భక్తులు తరలి వస్తారని తెలిసినా.. ప్రభుత్వం ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు. ప్రభుత్వం అలసత్వంతోనే తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలి' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. హోం శాఖ, దేవదాయ శాఖ ఏం చేస్తుందని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో చిన్నపాటి సంఘటన సైతం జరుగలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. తిరుమల భక్త జనానికి సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు.

ఐసీడీఎస్‌లో పలు నోటిఫికేషన్ల రద్దు

కర్నూలు(సెంట్రల్): ఐసీడీఎస్‌లో 2024 జనవరి, ఫిబ్రవరిలలో విడుదలైన పలు నోటిఫికేషన్లను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోషణ్ అభియాన్ పథకం కింద జిల్లా ప్రాజెక్టుఅసిస్టెంట్ పోస్టు, జువైనల్ జస్టిస్ బోర్డులో డేటా ఎంట్రీ ఆపరేటర్, శిశు గృహలో సోషల్ వర్కర్,ఆయా, చౌకీదార్ పోస్టులను పరిపాలన కారణాల రీత్యా రద్దు చేసినట్లు ఆయన వివరించారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని కోరారు.


విద్యుత్ చార్జీల పెంపుపై నేడు అభిప్రాయ సేకరణ

● విద్యుత్ ఎస్ఈ ఉమాపతి

కర్నూలు న్యూసిటీ: ఇంధన కొనుగోలు, రవాణా సర్దుబాటు పేరున విద్యుత్ చార్జీల పెంపుపై శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు జిల్లా విద్యుత్ పర్యవేక్షక ఇంజినీరు ఉమాపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎన్ కన్వెన్షన్‌లో 7, 8 తేదీల్లో ఆయాప్రాంతాల డిస్కంలపై ప్రజాప్రాయసేకరణ పూర్తయిందని పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని ఏపీఈఆర్‌సీ భవనంలో శుక్రవారం ఏపీఎస్పీడీసీఎల్ డిస్కం పరిధి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యక్తిగతంగా, మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. కర్నూలు జిల్లా ప్రజల కోసం టౌన్ డివిజన్, విద్యుత్ భవన్ సమావేశం మందిరం, ఎమ్మిగనూరు, ఆదోని డివిజన్ల ఇంజినీరింగ్ కార్యాలయల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.

మండల పరిషత్‌లకు రూ.7.71 కోట్లు విడుదల

కర్నూలు(అర్బన్): ఉమ్మడి జిల్లాలోని 53 మండల పరిషత్‌లకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి 3,4 క్వార్టర్లకు రూ.7,71,76,217లు విడుదల చేసిందని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో తలసరి గ్రాంట్ కింద రూ.1,52,35,944, సీనరేజ్ గ్రాంట్ కింద రూ.3,93,44,687, ఎంపీటీసీల గౌరవ వేతనాలకు రూ.2,25,95,586లను విడుదల చేశారన్నారు. పీఆర్అండ్ఆర్‌డీ కమిషనరేట్ విడుదల చేసిన మొత్తాన్ని అన్ని మండల పరిషత్‌లకు జమ చేశామని తెలిపారు. ఎంపీడీఓలు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు నిధులను సద్వినియోగం చేసుకోవాలని, ఎంపీటీసీలకు గౌరవ వేతనాలను చెల్లించాలన్నారు.



☛ ఓ ప్రైవేట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న ఆంజనేయులు(32)కు వారం క్రితం రాత్రివేళ ఛాతీలో పట్టేసింది. కర్నూలు నగరంలోని కల్లూరు ప్రాంతం నుంచి కుటుంబసభ్యులు అతన్ని కొత్తబస్టాండ్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి తీవ్ర గుండెపోటుగా గుర్తించి వైద్యం చేయగా ఆసుపత్రిలో కోలుకోలేక ఆయన మృతి చెందాడు.

☛ గతేడాది నవంబర్ 11వ తేదీ.. కృష్ణగిరి మండలం పెనుమాడలో ఓ యువకుడి వివాహం. స్నేహితులంతా హాజరై ఆనందంగా గిఫ్ట్ అందజేస్తున్నారు. ఇంతలోనే అందులో 28 ఏళ్ల ఓ యువకుడు వేదికపైనే కుప్ప కూలిపోయాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా గుండె పోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతి చెందిన యువకుడి పేరు వంశీ. సాఫ్ట్‌వేరు ఉద్యోగి. గోనెగండ్ల మండలం బి. అగ్రహారం సొంతూరు.

....జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు ఇటీవల పాతిక నుంచి 40 ఏళ్లలోపు వారే ఎక్కువగా గుండెపోటుతో వచ్చి చేరుతున్నారు. సకాలంలో ఆసుపత్రికి వచ్చిన వారు బతుకుతున్నారు. గుండెపోటును గుర్తించక గ్యాస్ట్రబుల్ అనుకుని తాత్సారం చేసిన వారు సమయం మీరిపోయి ఆసుపత్రికి వచ్చేలోపు మృత్యువాతపడుతున్నారు. ఇటీవల ఏ వీధిలో చూసినా చిన్న వయస్సులో మృతిచెందిన వారి ఫొటోతో ఉన్న ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి.

యువ గుండెకు పోటు!

● చిన్న వయస్సులోనే గుండె వ్యాధులు
● 35 ఏళ్లకే మృత్యువాత పడుతున్న కొందరు యువకులు
● కోవిడ్ తర్వాత పెరిగిన హృదయ వేదన కేసులు
● కర్నూలులోని ఆసుపత్రుల్లో ప్రతిరోజూ నలుగురైదుగురు చేరిక



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగం

కర్నూలు(హాస్పిటల్): మారిన జీవన శైలితో గుండె వ్యాధులు పెరిగిపోయాయి. జిల్లాలో 8 శాతం మంది ప్రజలు గుండెజబ్బులతో బాధపడుతున్నట్లు గతంలో నిర్వహించిన ఓ సర్వేలో నిర్ధారణ అయ్యింది. వీరే గాక వంశపారంపర్యం, జన్యులోపాలు, మేనరికపు వివాహం వంటి కారణాలతో పుట్టుకతోనే గుండెజబ్బులతో జన్మించే పిల్లలూ ఇటీవల అధికమయ్యారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగానికి వారానికి రెండు రోజులు ఓపీ ఉంటుంది. ప్రతి ఓపీ రోజున రోగుల సంఖ్య 300 నుంచి 350లకు ఉంటోంది. నెలకు ఇన్‌పేషంట్లుగా 400 నుంచి 500ల దాకా చేరి చికిత్స పొందుతున్నారు. నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఒక్కోదాంట్లో ఓపీ సంఖ్య రోజుకు 70 నుంచి 80 దాకా ఉంటోంది. ఇక్కడ కూడా రోజుకు 20 మందికి పైగా రోగులు గుండెపోటుకు గురై చికిత్స కోసం వస్తున్నారు. అందులో ఐదు మంది వరకు 40 ఏళ్లలోపు వారుండటం ఆందోళనకరం.

జీవనశైలిలో మార్పులతోనే..

శారీరక శ్రమలేని వ్యక్తుల రక్తంలో కొలెస్ట్రాల్ శాతం ఎక్కువగా ఉండి గుండెజబ్బులు వచ్చే అవకాశం ఉంటుంది. అధిక బరువు ఉన్నవారిలో కూడా ఈ జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువ. మధుమేహవ్యాధి గుండె రక్తనాళాలను దెబ్బ తినేటట్లు చేయడం వల్ల కూడా గుండెజబ్బులు రావచ్చు. అధిక చక్కెర, మాంసాహారం, వెన్న, నూనెలు వంటివి కొవ్వు పదార్థాలు గుండెజబ్బులు రావడానికి ముఖ్యపాత్ర వహిస్తాయి. కోవిడ్ అనంతరం గుండెజబ్బుల కేసులు మరింత పెరిగాయి. కోవిడ్ సమయంలో చాలా మంది రక్తనాళాల్లో బ్లాక్‌లు ఏర్పడ్డాయి.

గుండెపోటు రావడానికి కారణాలివీ..

➡ ధూమపానం, మద్యపానం, కొవ్వు పదార్థాలు అధికంగా వాడటం.
➡ పరగడుపున రక్తంలో గ్లూకోజ్ ఎక్కువగా ఉండటం.
➡ అధిక కొలెస్ట్రాల్, రక్తపోటు, శారీరక వ్యాయామం బాగా తగ్గడం.
➡ తల్లిదండ్రుల్లో, తోడు పుట్టిన వారిలో ఎవ్వరికైనా గుండె పోటు వచ్చినా కానీ, లిపోప్రొటీన్-ఎ, హైపర్ హోమోసిస్టెమియా, హైపర్ కాగ్యులబుల్ పరిస్థితి, కొకైన్ వాడకం లాంటివి ఉంటే ఈ సమస్యలు వస్తాయి.
➡ ధూమపానం ఉంటే 72శాతం, అధిక కొలెస్ట్రాల్ ఉంటే 52శాతం, కుటుంబంలో ఎవ్వరికైనా హార్ట్ ఎటాక్ చరిత్ర ఉంటే 35శాతం గుండె పోటు వచ్చే అవకాశం యువతలో ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

గుండెపోటు లక్షణాలు ఇవీ..

➤ కొద్దిదూరం నడవగానే ఆయాసం, ఛాతీలో పట్టేసినట్లుగా ఉంటుంది.
➤ చెమట ఎక్కువగా పడుతుండటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది గమనించవచ్చు.
➤ గుండెజబ్బు అనుమానం వస్తే సమీప ఆసుపత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకోవాలి.
➤ అవసరమైన చికిత్స తీసుకోవాలి.
➤ గుండెపోటు వచ్చిన మొదటి కొద్ది నిమిషాలు కీలకమైనవి.

గుండెజబ్బులు రాకుండా ఉండాలంటే...

➡ మద్యపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి.
➡ ప్రతిరోజూ వాకింగ్, యోగా, ధ్యానం చేయాలి.
➡ శాస్త్రీయ సంగీతం వినాలి. పాత పాటల్లోని సాహిత్యం మనస్సుకు ఎంతో హాయినిస్తుంది. పాశ్చాత్య సంగీతం బీపీ, హార్ట్ బీట్‌ను పెంచుతుంది.
➡ లిఫ్ట్‌లో వెళ్లడం కంటే మెట్లు ఎక్కడమే మేలు.
➡ సమతుల ఆహారంతో గుండెకు బలం చేకూరుతుంది.
➡ నూనెలో వేయించిన ఆహారాన్ని తగ్గించుకోవాలి. బయట లభించే ఫాస్ట్‌ఫుడ్స్, బేకరి ఫుడ్స్‌కు, దిగుమతి చేసుకున్న చికెన్ లెగ్స్‌కు దూరంగా ఉండాలి.
➡ బజ్జీలు తినాల్సి వస్తే ఇంట్లోనే చేసుకోవాలి.
➡ బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. స్థూలకాయం తగ్గించుకోవాలి.
➡ వయస్సుకు తగినట్లు నిద్రపోవాలి. నిద్ర తగ్గితే శరీరం రోగాలను ఆహ్వానిస్తుంది.

ఈ యేడాది పెద్దాసుపత్రిలో గుండెపోటు మరణాలు

మాసం	అడ్మిషన్ల సంఖ్య	మరణాల సంఖ్య
జనవరి	245	27
ఫిబ్రవరి	235	26
మార్చి	258	18
ఏప్రిల్	252	23
మే	254	14
జూన్	250	27
జులై	308	22
ఆగస్టు	310	20
సెప్టెంబర్	196	15
అక్టోబర్	185	12
నవంబర్	203	16
మొత్తం	2,696	220

ధూమపానం వల్లే అధిక సమస్య



ఇటీవల కాలంలో చిన్న వయస్సు నుంచే ధూమపానం చేయడం అధికమైంది. దీంతో పాటు కోవిడ్ అనంతరం శారీరక శ్రమ చాలా మందికి తగ్గిపోయింది. గంటల సేపు టీవీలు, మొబైల్‌లకు అతుక్కుపోవడం కూడా గుండెకు ముప్పే. ఈ యేడాది 960 మందికి యాంజియోగ్రామ్, 350 మందికి స్టెంట్లు, నలుగురికి పేస్‌మేకర్లు, ఇద్దరికి కిడ్నీలోని రక్తనాళాలకు స్టెంట్లు వేశాం.
–డాక్టర్ బి. కిరణ్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

స్టెమీ ప్రోగ్రామ్‌లో ఖరీదైన ఇంజెక్షన్లు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టెమీ ప్రోగ్రామ్ కింద దాదాపు రూ.40వేల ఖరీదైన టెనెక్టిప్లేజ్ ఇంజెక్షన్లు ఉచితంగా ఇస్తున్నాం. గుండెపోటు వచ్చిన రెండు గంటలలోపు ఆసుపత్రికి రోగిని తీసుకువస్తేనే ఈ ఇంజెక్షన్ బాగా పనిచేస్తుంది. ఇటీవల కాలంలో ఎక్కువ శాతం 30 నుంచి 40 ఏళ్లలోపు వారే గుండెపోటుతో వస్తున్నారు.
–డాక్టర్ డీవీ. రామశివనాయక్, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ, జీజీహెచ్, కర్నూలు

సంక్రాంతి పండుగ సెలవులొచ్చేశాయ్..!




సెలవుల ప్రకటనతో సంతోషంగా ఇంటికెళ్తున్న ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డి ఎంపీపీ పాఠశాల విద్యార్థులు

కర్నూలు కల్చరల్/ఎమ్మిగనూరు రూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు సెలవులు ఇచ్చినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. శామ్యూల్‌పాల్ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సెలవులను ప్రకటించినట్లు చెప్పారు. పాఠశాలలు ఈనెల 20వ తేదీన పునఃప్రారంభమవుతాయన్నారు. అలాగే మిషనరీ పాఠశాలలకు సంక్రాంతి సెలవులు 11 నుంచి 15వ తేదీ వరకు ఉంటాయని పేర్కొన్నారు. 16వ తేదీన పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సంక్రాంతి సెలవుల్లో పదో తరగతి బోధిస్తున్న ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఫోన్ ద్వారా విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి అసైన్‌మెంట్ ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు.

గ్రామ పంచాయతీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

● జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లాలో గ్రామ పంచాయతీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా వాటిని పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి కోరారు. ఈ నెల 8వ తేదీ నుంచి స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో జరుగుతున్న ఎంపీడీఓ, డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీల శిక్షణా కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ముగింపు సమావేశానికి హాజరైన సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ఆస్తుల పరిరక్షణకు సంబంధించి నివాసాలు, గ్రామ కంఠం స్థలాలను ఆన్‌లైన్ చేస్తున్నదన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా తాగునీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ప్రతి ఫిల్లింగ్‌కు క్లోరినేషన్ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ మంజులవాణి, ఎంటీలు శ్రీనివాసులు, రఘునాథ్, రవికిశోర్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్ తదితరులు పాల్గొన్నారు.

మోక్ష ప్రాప్తి.. వైకుంఠ ఏకాదశి

● నేడు ముక్కోటి ఏకాదశి
● అనంత పుణ్యప్రదం ఉత్తర ద్వార దర్శనం
● జిల్లా వ్యాప్తంగా వైష్ణవ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి



విద్యుదీపాలంకరణలో ఆదోని తిరుమలనగర్ వెంకటేశ్వరస్వామి ఆలయం



శోభాయమానంగా మద్దిలేటయ్య క్షేత్రం

కర్నూలు కల్చరల్: సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణం వరకు జరిగే మార్గం మధ్యలో ముక్కోటి ఏకాదశి వస్తుంది. వైకుంఠ ఏకాదశి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించే వారికి మూడు కోట్ల ఏకాదశుల వ్రతం చేసిన ఫలం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. శుక్రవారం ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీహరిని ముక్కోటి ఏకాదశి రోజున దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్న పుణ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయి. ఈ రోజునే శివుడు హాలాహలం మింగాడని, మహాభారత యుద్ధంలో శ్రీ కృష్ణుడు అర్జునికి ఇదే రోజున భగవద్గీతను ఉపదేశించాడని పురాణాలు చెబుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆర్ఎస్ రంగాపురం మద్దిలేటి స్వామి ఆలయం, అహోబిలం, పెరవలి రంగనాథ స్వామి ఆలయంతోపాటు నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, పత్తికొండ, తదితర ప్రాంతాల వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. మద్దిలేటయ్య క్షేత్రంలో శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు.

మధ్యాహ్నం ఇంటి భోజనం!

కర్నూలు(రూరల్): అధికారుల నిర్లక్ష్యంతో పాఠశాలకు మధ్యాహ్న భోజన బియ్యం సరఫరా నిలిచి విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిడ్జూరు ప్రాథమిక బీసీ పాఠశాలలో ఈనెల 2వ తేదీ నుంచి మధ్యాహ్న భోజన నిర్వహణ నిలిచిపోయింది. పాఠశాలకు బియ్యం సరఫరా చేసే డీలర్‌ను తొలగించడంతో కొన్నాళ్లు సమీప పాఠశాల నుంచి బియ్యం తెచ్చుకుని మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించారు. అయితే ఆయా పాఠశాలల్లో సమస్య ఉత్పన్నం కావడంతో నిడ్జూరు ప్రాథమిక బీసీ పాఠశాలకు బియ్యం ఇవ్వడం నిలిపేశారు. దీంతో మధ్యాహ్న భోజనం వండక పోవడంతో కొంత మంది ఇంటి నుంచి క్యారేర్లు తెచ్చుకుంటుండగా, మరి కొందరు విద్యార్థులు ఇళ్లకు వెళ్లి తినివస్తున్నారు. కర్నూలు నగరానికి కూత వేటు దూరంలో ఉన్న పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిలిచి వారం రోజులు గడిచినా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఈ విషయంపై ఎంఈఓ -2 వినోద్ కుమార్‌ను వివరణ కోరగా.. గ్రామంలో మరో డీలర్ నుంచి బియ్యం సరాఫరా చేయాలని కోరామని, సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తామన్నారు.



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లపై అవగాహన కల్పించండి

● ఎస్పీ బిందు మాధవ్



సీడీలను ఆవిష్కరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లపై పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించండి ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. పసిపిల్లలపై బ్యాడ్ టచ్ జరిగితే తీసుకోవలసిన చర్యలపై ఆడియో, వీడియో సీడీని ఆయన ఆవిష్కరించారు. లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం ఆడియో, వీడియో సీడీలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా చోట్ల చిన్నపిల్లలపై లైంగిక దాడులు జరుగుతున్నాయన్నారు. పసిపిల్లలపై బ్యాడ్ టచ్ జరిగినప్పుడు సమాజానికి భయపడి, తల్లిదండ్రులకు చెబితే తిడతారేమోనని, చదువు మానిపిస్తారేమో అని భయపడకుండా 100కు లేదా 112కు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులెవరైనా ఫిర్యాదు చేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అవగాహన కార్యక్రమంలో ముఖ్య పాత్ర వహించి కృషి చేసిన కోడుమూరు సీఐ తబ్రేజ్, సంగీత దర్శకులు ఫయామ్, గాయకుడు కరీముల్లా, డ్యాన్సర్లు, నటీనటులు, పోలీసులు, విద్యార్థులను ఎస్పీ అభినందించారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జి.హుసేన్‌పీరా, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, కర్నూలు పట్టణ సీఐలు, ఎస్ఐలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ప్రతినిధులు

కడపలోనే కొనసాగించాలి

కర్నూలు (అగ్రికల్చర్): మూడు గ్రామీణ బ్యాంకుల విలీనం తర్వాత రాష్ట్రస్థాయి బ్యాంకుగా అవతరించిన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం సాయంత్రం జిల్లాపరిషత్ గాంధీ విగ్రహం ఎదుట సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా కన్వీనర్ నాగరాజు, కో-కన్వీనర్ ప్రసాద్ శర్మ, ఇతర నాయకులు భాస్కర్ రెడ్డి, రఘుబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో మూడు బ్యాంకులు విలీనం అయినందున రాష్ట్రంలోనే అతి పెద్ద బ్యాంకుగా అవతరించిందని పేర్కొన్నారు. సంప్రదాయం ప్రకారం చూసినా, ఆర్థిక శాఖ మార్గదర్శకాలలో తొలి ప్రాధాన్యత ప్రకారం పరిశీలించినా ఏపీజీబీ రాష్ట్రస్థాయి ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించడం సముచితమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఉద్యోగుల సంఘం నాయకులు నాగయ్య, రమణారెడ్డి, రియాజ్, హనుమంతురెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.



బోధనలు వినిపిస్తున్న మతపెద్దలు



దువాలో పాల్గొన్న ముస్లింలు

ప్రశాంతంగా ముగిసిన ఇస్తెమా

● లక్షలాదిగా తరలివచ్చిన ముస్లింలు




దువా ముగియడంతో బయటకు వస్తున్న ముస్లింలు

ఆత్మకూరు: ఇస్తెమా కార్యక్రమం గురువారం ఆత్మకూరు పట్టణంలో ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాల నుంచి లక్షలాదిగా ముస్లింలు తరలివచ్చారు. ఇస్తెమా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఇస్తెమాలో ముస్లింలు దువా నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు కూడా దువాలో పాల్గొన్నారు. దువా సమయంలో మతపెద్దలు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో పయనించాలని, సహనాన్ని కలిగి ఉండాలని అన్నారు. ప్రస్తుతం దుఃఖంతో జీవిస్తున్నారని, దీనిని పారద్రోలాలంటే మంచిమార్గమే ఉత్తమమని చెప్పారు. ఇస్తెమాలో పాల్గొనేందుకు లక్షలాది మంది మోటార్ బైకులు, కార్లు, ఆటోలు, ప్రత్యేక బస్సులు, మినీ లారీలతో ఆత్మకూరుకు తరలివచ్చారు. అత్యధికంగా బైకులు వచ్చాయి. ఇస్తెమా అనంతరం భక్తులు తిరిగి వారి స్వగ్రామాలకు వెళ్లే సమయంలో జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా ఆత్మకూరులో మకాం వేసి దగ్గరుండి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాడు. షాదీఖానా, గీతాభవన్, అగ్నిమాపక కేంద్రం, సిద్ధపల్లి క్రాస్ రోడ్డు, నంద్యాల టర్నింగ్, ఫోర్‌లైన్ జంక్షన్ల మధ్య ఆయన స్వయంగా ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఇస్తెమా నిర్వహించిన ప్రదేశం నుంచి ఒక్కసారిగా యువకులు, ముస్లింలు పెద్ద ఎత్తున బయటికి తరలిరావడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. కంట్రోల్ రూం నుంచి జిల్లా ఎస్పీ సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్‌ను పరిశీలిస్తూ సలహాలు ఇచ్చారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు.

సొంత లాభం కొంత మానుకొని..

- ఆదర్శంగా వైద్య దంపతుల కుటుంబం
- స్వగ్రామం కలుగొట్లలో ఏటా నూతన సంవత్సరం సందర్భంగా వైద్య శిబిరాలు
- ఉచితంగా మందుల పంపిణీ
- అత్యవసరమైన వారికి మెరుగైన చికిత్సకు రెఫర్



పుట్టిన గ్రామానికి ఏదైనా చేయాలని ఆ వ్యక్తి సంకల్పించుకున్నాడు. పట్టుదలతో చదివి డాక్టర్‌గా స్థిరపడ్డాడు. ఎక్కడో ఉన్నా స్వగ్రామంపై ఉన్న మమకారంతో ఏటా నూతన సంవత్సరం రోజున గ్రామంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి చికిత్సలతో పాటు మందులు అందిస్తున్నాడు. డాక్టర్ అయిన భార్య, వైద్య వృత్తిలో ఉన్న కొందరు స్నేహితుల ద్వారా సొంత ఖర్చుతో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ మన్ననలు పొందుతున్నారు.



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జస్మిత



డాక్టర్ రామదాసు వైద్య బృందం

వెల్దుర్తి(కృష్ణగిరి): కలుగొట్ల గ్రామ ప్రజలకు వైద్య సేవల రూపంలో నూతన ఆశలు పంచుతున్న డాక్టర్ రామదాసు కుటుంబం ఆదర్శంగా నిలుస్తోంది. డాక్టర్ రామదాసు, భార్య డాక్టర్ జస్మిత, చెల్లి డాక్టర్ మద్దమ్మ, స్నేహితుడు డాక్టర్ రంగస్వామి కలిసి ఏటా నూతన సంవత్సరాన్ని గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమానికి అంకితం చేస్తున్నారు. డాక్టర్ రామదాసు జీవన యాత్రకు కలుగొట్ల గ్రామం పునాది. కర్నూలు జిల్లా, వెల్దుర్తి మండలంలోని ఈ చిన్న గ్రామంలో జన్మించిన రామదాసు తన ప్రాథమిక, ఉన్నత విద్యను వెల్దుర్తి ఎస్సీ హాస్టల్‌లోనే ఉంటూ జెడ్పీ హైస్కూల్ (2004 పదో తరగతి బ్యాచ్)లో పూర్తి చేసి, కర్నూలులోని ఆదర్శ జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీ పూర్తి చేశారు. తరువాత తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్‌గా ప్రస్థానం ప్రారంభించారు. మైక్రో బయాలజీలో పీజీ పూర్తి చేసి ప్రస్తుతం వైజాగ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుడిగా సేవలందిస్తున్నారు. ఈయన వేలూరు నారాయణ కాలేజీలో న్యాచురోపతి పూర్తి చేశారు. స్వగ్రామంతో ఆయనకున్న అనుబంధం జీవితాన్ని సేవా మార్గంలోకి నడిపించింది.

సొంత గ్రామానికి, పేదలకు సేవలోనే సంతృప్తి



వైద్య వృత్తిలో ఎంత ఎదిగినా సొంత గ్రామంలోని పేదలకు చేస్తున్న సేవలోనే సంతృప్తి పొందుతున్నాను. వారికి వైద్యంపై అవగాహనలేమి, పేదరికం నన్ను ఈ సేవకు పురిగొల్పాయి. తనకు తోడుగా భార్య, సోదరి, స్నేహితులు, ఇంకా ఎందరో వైద్యులు, సిబ్బంది పూర్తిగా సహకారం అందిస్తున్నారు. గ్రామస్తుల ఆప్యాయత వల్లే వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించగలుగుతున్నాను. – డాక్టర్ రామదాసు

స్ఫూర్తిదాయక కారణం

రామదాసు సేవా యాత్రకు ప్రేరణ ఆయన సొంతూరు కలుగొట్లలో పొరుగింటి మహిళ అనారోగ్యంతో మృతిచెందింది. రక్తపోటు(బీపీ)తో బాధపడుతున్న ఆ మహిళకు సరైన సమయంలో మందులు ఎలా వాడాలో అవగాహన లేక బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మరణించింది. ఆమె మరణం రామదాసును ఎంతగానో కలచివేసింది. నాటి నుంచే పేద ప్రజలకు వైద్య చికిత్సపై అవగాహన లేమిని రూపుమాపాలని, తన వంతు సేవ అందించాలని బలంగా నాటుకుపోయింది. 'వైద్యులుగా తమ బాధ్యత కేవలం ఆస్పత్రులకే పరిమితం కాకుండా, పేదల కోసం సేవ చేయడం కూడా అవసరం' అని భావించి, తన సొంత గ్రామంలో మూడేళ్లుగా సొంత ఖర్చులతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మూడేళ్లలో నిర్వహించిన శిబిరాల్లో 2 వేల మందికి వైద్య సేవలు అందించారు. హైబీపీ, ఇతరత్రా సమస్యలున్న వారికి వైద్యసేవల ద్వారా చికిత్స అందించారు.

తోడుగా నిలిచిన కుటుంబ సభ్యులు, స్నేహితులు

డాక్టర్ రామదాసు సేవా కార్యక్రమానికి అతని భార్య డాక్టర్ క్రిష్ణ జస్మిత తోడుగా నిలిచింది. అనంతపురం జిల్లా గుత్తికి చెందిన ఈమె జనరల్ ఫిజీషియన్‌గా వైద్య విద్య పూర్తి చేసుకుని ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే రామదాసుకు వరుసకు సోదరి, కలుగొట్లకే చెందిన డాక్టర్ మద్దమ్మ (ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్). ఎంబీబీఎస్‌లో జూనియర్, స్నేహితుడైన ఆదోని మండలం కోసిగి గ్రామానికి చెందిన డాక్టర్ రంగస్వామి (ప్రస్తుతం వెల్దుర్తి సీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్) సేవా కార్యక్రమానికి పూర్తి మద్దతు అందిస్తున్నారు. వీరు తమ సొంత డబ్బుతో గ్రామ ప్రజలకు అవసరమైన సేవలు, అవగాహన, ఉచితంగా ఔషధాలు అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని తగిన వైద్య చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలలకు పంపేందుకు, ప్రభుత్వ వైద్యాధికారులను సంప్రదించేందుకు సమష్టిగా కృషి చేస్తున్నారు.

నూతన సంవత్సరం కానుకగా..

ఏటా నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న డాక్టర్ రామదాసు, అతని బృందం కలుగొట్లకు చేరుకుని రెండు రోజులపాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం, వైద్య పరీక్షలు (రక్త పరీక్షలు, ఈసీజీ లాంటివి) చేయడం, అవసమైన మందులు ఉచితంగా అందిస్తారు. తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రభుత్వ వైద్య కేంద్రాలకు రెఫర్ చేసి చికిత్స అందేలా చర్యలు తీసుకుంటారు.

క్లుప్తంగా

చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డోన్‌లో బస



స్వాగతం పలుకుతున్న అధికారులు

డోన్ టౌన్: చేనేత జౌళిశాఖ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సునిత గురువారం రాత్రి డోన్‌కు వచ్చారు. ఆమెకు ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ నాగమణి స్వాగతం పలికారు. ప్రిన్సిపల్ సెక్రటరీకి రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో బస ఏర్పాట్లు చేశారు. కాగా శుక్రవారం కోడుమూరులో జరగనున్న రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రి సవిత హాజరుకానున్న కార్యక్రమానికి వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు పాతబస్తీలోని ఎర్రబురుజులో నివాసముంటున్న సందెపోగు భార్గవి (32) ఆత్మహత్య చేసుకుంది. ఈమె భర్త సతీష్ కర్నూలు కార్పొరేషన్‌లో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నాడు. పదేళ్ల క్రితం వీరికి వివాహమయ్యింది. కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా భార్గవి అనారోగ్యంతో బాధ పడుతుండేది. గురువారం మధ్యాహ్నం బిస్కెట్లు తెచ్చుకోమని పిల్లలను బయటకు పంపి తలుపులు బిగించుకుని చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. అనారోగ్య కారణాల వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఒకటో పట్టణ పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

దిశ వన్‌స్టాప్ సెంటర్ పరిశీలన



శక్తిసదన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని దిశ వన్‌స్టాప్ కేంద్రం, మహిళా ప్రాంగణం (శక్తిసదన్)లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి గురువారం పరిశీలించారు. కార్యాలయాల రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. దిశ వన్‌స్టాప్ సెంటర్ ప్రాంగణం ఆవరణలో కాలువ నీటి అపరిశుభ్రత కారణంగా సంబంధిత అధికారి శుభ్రపరుచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. శక్తిసదన్, వన్‌స్టాప్ సెంటర్‌లోని వారికి లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులని తెలిపారు. డీసీపీఓ శారద, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

20 నుంచి మళ్లీ రీ సర్వే ప్రారంభం కావాలి



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు (సెంట్రల్): జిల్లాలో ఈనెల 20వ తేదీ నుంచి రీ సర్వేను ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు కింద రీ సర్వే గురించి జిల్లాలోని ఆర్ఎస్‌డీటీలు, మండల సర్వేయర్లకు, డిప్యూటీ తహసీల్దార్లకు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాల్లో 25 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసుకుని సర్వేను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆర్‌డీఓల ఆధ్వర్యంలో రీ సర్వేపై ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని జేసీ ఆదేశించారు. ప్రతి గ్రామంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామ సరిహద్దులను గుర్తించి గ్రామంలోని అన్ని ప్రభుత్వ భూములను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే అధికారి మునికన్న న్, ఆర్ఎస్‌డీటీలు, మండల సర్వేలకు, డిప్యూటీ తహసీల్దార్లకు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

కర్నూలు: కర్నూలు నగరానికి చెందిన ఓ నిందితుడికి పోక్సో కేసులో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కేసుల విచారణ న్యాయస్థానం తీర్పునిచ్చింది. స్థానిక బుధవారపేటకు చెందిన గౌండా (బేల్దారు) పనిచేస్తున్న బొగ్గుల రాజేష్ 2021లో అదే కాలనీలోని పదేళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, అసభ్యకర ఫొటోలు చూపిస్తూ మాట్లాడటంతో బాలిక తల్లి దండించగా క్షమాపణ చెప్పాడు. మళ్లీ కొద్ది రోజుల తర్వాత అదే సంవత్సరం జూన్ 23వ తేదీ ఎవరూ లేని సమయంలో బాలికను ఇబ్బందులకు గురిచేస్తూ బాధ పెడుతున్నట్లు బాలిక తల్లి ఫిర్యాదు చేసింది మూడో పట్టణ అప్పటి ఎస్ఐ రహంతుల్లా, మహిళా పీఎస్ ఎస్ఐ కొండయ్యలు దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి భూపాల్‌రెడ్డి నిందితుడు బొగ్గుల రాజేష్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. స్పెషల్ పీపీలు వెంకటేశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దర్యాప్తు అధికారులు రహంతుల్లా, కొండయ్య, మూడో పట్టణ కోర్టు కానిస్టేబుల్ జాన్సన్ ఇమ్మానుయేలు, కిషోర్‌లను ఎస్పీ అభినందించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

తుగ్గలి: భార్యభర్తల మధ్య మనస్పర్థలతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన జీ.ఎర్రగుడిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంతకల్లు మండలం ముకలపెంటకు చెందిన శివ(38)కు 12 ఏళ్ల క్రితం జీ.ఎర్రగుడికి చెందిన వరలక్ష్మితో వివాహమైంది. వీరికి కుమారుడు ఉన్నారు. కడపలో నివాసముంటున్న శివ కొంత కాలంగా జీ.ఎర్రగుడి వచ్చి భార్యతో ఉంటున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు జొన్నగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతిపై ఆరా తీశారు. మృతుడి సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్నాతకోత్సవ దరఖాస్తులకు గడువు పొడిగింపు

కర్నూలు కల్చరల్: క్లస్టర్ విశ్వవిద్యాలయ కాన్వకేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు గడువును పొడిగించినట్లు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈనెల 18 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు వివిధ విశ్వవిద్యాలయాల నుంచి లోయర్ డిగ్రీలు అందుబాటులో లేనందున గడువు లోపు దరఖాస్తు చేసుకోలేక పోయారని తెలిపారు. వారి అభ్యర్థన మేరకే పది రోజులు గడువు పెంచామని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ 94419 78898ను సంప్రదించాలని తెలిపారు.

ఉమ్రా యాత్రకు మంత్రి ఫరూక్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శుక్రవారం ఉమ్రా యాత్రకు వెళ్తున్నారు. ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా, మదీనా ప్రార్థన మందిరాల సందర్శన అనంతరం 18వ తేదీన మంత్రి ఫరూక్ తిరిగి రానున్నారు. ఉమ్రా యాత్రకు వెళ్తున్న మంత్రిని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం నేతలు ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు, శాంతి సౌభాగ్యాలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఉమ్రా యాత్రలో ప్రార్థిస్తానన్నారు. అనంతరం విజయవాడ సమీపంలోని కొండపల్లి గ్రామంలో జరిగిన హజరత్ సయ్యద్ షా బొఖారి 428వ ఉరుసు- ముబారక్ ఉరుసు మహోత్సవం తొలి రోజు కార్యక్రమానికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ హాజరయ్యారు. పురాతన దర్గాను సందర్శించిన మంత్రి ఫరూక్ చాదర్‌ను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ, పలువురు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.




అడుగు తడబడితే అంతే..!

- ప్రమాదం అంచున విద్యార్థినుల పయనం

గోనెగండ్ల బీసీ బాలికల వసతి గృహం విద్యార్థినులు పాఠశాలకు వెళ్లాలంటే ప్రమాదాన్ని దాటాల్సి వస్తోంది. గోనెగండ్లలోని గంజిహళ్లి రోడ్డులో తుంగభద్ర దిగువ కాలువ పక్కనే బీసీ బాలికల వసతి గృహం ఉంది. ఇక్కడ 250 మంది విద్యార్థినులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. హాస్టల్‌కు రస్తా లేకపోవడంతో అధికారులు తుంగభద్ర దిగువ కాలువకు రెండు పైపులు వేసి కల్వర్టులాగా తయారు చేశారు. దానిపై కట్టమాదిరి వేసిన మట్టి కాలువలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో విద్యార్థినులు పాఠశాలకు వెళ్లి వచ్చేటపుడు జాగ్రత్తగా నడవాల్సి వస్తోంది. ఏ మాత్రం అ జాగ్రత్తగా ఉన్నా కాలు జారి కాలువలో పడే ప్రమాదం ఉంది. విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకొని కాలువపై బ్రిడ్జి నిర్మించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – గోనెగండ్ల


'బోరు' మంటూ భూమిలోకి..



ఎన్‌హెచ్ 340 సీ నిర్మాణంలో నేలలోకి దిగబడిన చేతిపంపు

కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి పక్కనున్న చేతి పంపు క్రమంగా కనుమరుగవుతోంది. నేషనల్‌హైవే 340సీలో భాగంగా రోడ్డు నిర్మాణంలో భాగంగా చేతి పంపు చుట్టూ గుంత తీశారు. ఈ చేతి పంపు పాములపాడు మండలంలోని కంబాలపల్లి, యర్రగూడూరు గ్రామాల ప్రజలకే కాకుండా రహదారిలో ప్రయాణించే ప్రయాణికులు, బాటసారులకు దాహార్తి తీరుస్తోంది. వేసవి కాలంలో పై రెండు గ్రామాల్లోని చేతిపంపుల్లో నీరు రాకపోయినప్పటికీ ఈ చేతి పంపు దగ్గరకు రావాల్సిందే. ఇక్కడే పెద్ద మర్రి చెట్టు పై తాటి చెట్టు కూడా ఉండేది. ప్రయాణికులు వాహనాలు నిలిపి దాహార్తి తీర్చుకొని కొంత సేపు సేదతీరేవారు. ఇక నుంచి ఆ సౌలభ్యం కరువైనట్లే. – పాములపాడు

చాక్‌పీస్‌లపై దేవతా చిత్రాలు



చాక్‌పీస్‌పై ఇరువైపులా వేసిన దశావతారాలు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ చాక్‌పీస్‌పై ఇరువైపులా పది మంది దేవతా చిత్రాలు (దశావతారాలు) చిత్రించి అబ్బురపరిచారు. వేంకటేశ్వరస్వామి, నరసింహ, వరహా, వామన, కూర్మా, మత్స్య, పరశురామ, రామ, కృష్ణ, కల్కి అవతారాలను చిత్రించారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ లోకంలో అధర్మం పెరిగినప్పుడు ధర్మాన్ని రక్షించడానికి, చెడును అణిచి వేయడానికి ఎత్తిన మహావిష్ణువు పది అవతారాలను చిత్రించానన్నారు. – నంద్యాల(అర్బన్)

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు తెలపండి

కర్నూలు (సెంట్రల్): జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, గ్రేడ్ వన్ వీఆర్వోలకు త్వరలోనే సీనియర్ అసిస్టెంట్లు/ఎంఆర్‌ఐలు పదోన్నతులు కల్పించనున్నారు. ఈ క్రమంలో ఆయా కేటగిరీ పోస్టుల సీనియారిటీ జాబితాను రూ పొందించామని, వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లో తెలపాలని గురు వారం డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ ఓ ప్రకటనలో కోరారు. ఇందుకు సంబంధించిన జాబితాను కలెక్టరేట్‌తో పాటు ఆర్‌డీఓ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 23 మంది జూనియర్ అసిస్టెంట్లు/టైపిస్టులు, 16 మంది గ్రేడ్ వన్ వీఆర్వోలకు పదోన్నతులు లభించనున్నట్లు తెలుస్తోంది.

వలసలు నివారించండి

- డ్వామా పీడీ వెంకటరమణయ్య

కృష్ణగిరి: స్థానికంగా ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య సూచించారు. ఉపాధి కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే వలసలు ప్రారంభమయ్యావని, కూలీలకు పనులు కల్పించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ప్రతి రోజు 4 వేల మందికి పనులు కల్పించాల్సి ఉండగా కేవలం 2 వేలకుపైగా మందికి మాత్రమే పనులు కల్పిస్తున్నారన్నారు. టార్గెట్ ప్రకారం కూలీలకు పనులు కల్పించడంతోపాటు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏపీఓ నాగసులోచనకు సూచించారు. అనంతరం టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు.

మరణించి ఇద్దరికి వెలుగు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని వెంకటాద్రినగర్‌కు చెందిన రామాయణం భ్రమరాంబ(65) అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. ఆమె మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శోభన్‌బాబు, ఐ డొనేషన్ కమిటీ చైర్మన్ గోనూరు యుగంధర్‌శెట్టిలు భ్రమరాంబ కుటుంబసభ్యులను నేత్రదానానికి ఒప్పించారు. ఈ మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఐ బ్యాంక్ టెక్నీషియన్లు వచ్చి నేత్రాలను సేకరించారు.

ప్రతిఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఎన్‌సీడీ 3.0 సర్వేలో భాగంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ శైలేష్‌కుమార్ చెప్పారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చరర్స్ గ్యాలరీలో హైరిస్క్ ప్రెగ్నెన్సీపై ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్, ట్రాకింగ్‌పై వార్డు, గ్రామ మహిళా ఆరోగ్య కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్లు దాటిన వారందరికీ రక్తపోటు, మధుమేహం, రక్తహీనత పరీక్షలు, 30 ఏళ్లు దాటిన వారికి రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను ఇంటింటికీ వెళ్లి చేయాలని సూచించారు. బరువు తగ్గడం, జ్వరం, అలసట, శరీరంలో మార్పులు, అసాధారణ రక్తస్రావం, మానని పుండ్లు, రుతుక్రమంలో మార్పులు, రొమ్ములో గడ్డలు, జీర్ణ సంబంధిత సమస్యలు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యాధికారికి తెలపాలన్నారు. డీపీహెచ్‌ఎన్ఓ కె.అన్నపూర్ణ, స్టేట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ప్రశాంత్, పీహెచ్ఎన్ మీనాక్షి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, ఎంపీహెచ్ఈఓ మూర్తి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో గిరిజన సాంస్కృతిక ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో రాజమండ్రి నన్నయ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న గిరిజన సాంస్కృతిక మహోత్సవాల కరపత్రాలను గురువారం క్లస్టర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఒక భాగంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, టీఎస్ఎఫ్ నాయకులు రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3,006	6,810
పొద్దుతిరుగుడు	2,589	2,589
ఆముదం	5,189	5,591
వాము	12,069	12,069
ఉల్లి	1,105	2,459
ఎండుమిర్చి	2,989	14,109
శనగలు	2,010	6,256
కందులు	3,100	8,011
మొక్కజొన్న	2,281	2,345
మినుములు	7,743	7,909
కొర్రలు	2,169	3,113
సోయాచిక్కుడు	3,609	3,609
సజ్జలు	2,009	2,851

ఫోన్ నం : 08518-257204, 257661



సై.. సైరా .. బసవా!

కష్టపడి పని చేసే మనిషిని 'ఎద్దులా కష్టపడతారు' అని పోల్చుతారు. గ్రామీణ వ్యవసాయంలో ఎద్దు కష్టం అలాంటిది. ఎంతటి బరువైనా సరే తగ్గేదేల్యా.. అంటూ ఎద్దులు ముందుకు అడుగులు వేస్తాయి. వ్యవసాయం ఇప్పుడు అంతా యాంత్రీకరణ అయ్యింది. విత్తు మొదలు కోతలు వరకు అధిక శాతం యంత్రాలను ఉపయోగిస్తున్నారు. అక్కడక్కడా కొందరు ఎద్దులతోనే సేద్యం చేస్తున్నారు. బుర్రారెడ్డిపల్లె పొలాల్లో పంట నూర్పిడి పూర్తయిన తర్వాత ధాన్యాన్ని ఎద్దుల బండికి ఇంటికి చేర్చుతున్న దృశ్యమిది. – దొర్నిపాడు

పతకాలు సాధిస్తే నజరానా

కర్నూలు (టౌన్): పతకాలను సాధించిన క్రీడాకారులకు నజరానా అందజేస్తానని స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ జీ.శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో టెన్నికాయిట్ క్రీడా కారులకు ఆయన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 11, 12 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో నిర్వహించనున్న 41వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజేతలుగా తిరిగిరావాలన్నారు. పీఈటీలు పాల్గొన్నారు.

20 నుంచి కుష్టు గుర్తింపు సర్వే


కర్నూలు(హాస్పిటల్): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే నిర్వహించనున్నట్లు న్యూక్లియస్ వైద్యాధికారి డాక్టర్ జి.మల్లికార్జున్‌రెడ్డి చెప్పారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని ఓపీ నంబర్ 36 (టీబీ సెంటర్)లో కర్నూలు డివిజన్ పరిధిలోని ఎన్ఎల్ఈపీ నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చర్మం మీద స్పర్శలేని రాగి రంగు మచ్చలు, నరాల వాపు, కాళ్లు, చేతులు తిమ్మిర్లుగా ఉంటే కుష్టు వ్యాధి కావొచ్చని తెలిపారు. ఈ లక్షణాలున్న వారు పరీక్ష చేయించుకుని.. వ్యాధి నిర్ధారణ అయితే ఎండీటీ మందులు ఉచితంగా పొందవచ్చన్నారు. అనంతరం ఎల్‌సీడీసీ సంబంధిత కరపత్రాలు, బ్యానర్లు ఆవిష్కరించి పంపిణీ చేశారు. కుష్టు వార్డు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామశిరీష, డీపీఎంఓలు జి.విజయప్రకాష్, వై.సుబ్రహ్మణ్యం, పీటీ రెడ్డిబాబు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ సూచించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆన్‌లైన్‌లో అందిస్తున్న సి-సైన్స్ ప్రోగ్రాంను క్లస్టర్ వర్సిటీ నోడల్ కేంద్రమైన కేవీఆర్ కళాశాలలో గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 514 నోడల్ సెంటర్లలో ఈ ప్రోగ్రాం అందించడం జరుగుతుందన్నారు. ఇస్రో అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముక్కోటి ఏకాదశికి ముస్తాబు





సంకల్‌బాగ్ హరిహరక్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి, లలితా పీఠంలో వేంకటేశ్వర స్వామి, హరిహర క్షేత్రంలో ఏర్పాట్లు



భక్తులు క్యూలైన్‌లో వెళ్లేలా బారీ కేడ్ల ఏర్పాటు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలోని వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఇస్కాన్ పూరి జగన్నాథ మందిరం, వెంకటరమణ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం, చిన్మయ మిషన్, కృష్ణానగర్ శ్రీనివాస మందిర్, సంకల్‌బాగ్ హరిహర క్షేత్రం, వాసవీ నగర్, దండెగేరి వేంకటేశ్వర స్వామి ఆలయాలు, బీక్యాంప్ విజ్ఞాన మందిరం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, ఓల్డ్ బస్టాండ్ మాలెబాలయ్య సత్రం, సుంకేసుల రోడ్‌లోని గోదా గోకులం, జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠం, సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారాలను ఏర్పాటు చేసి భక్తులు స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. ఏకాదశి రోజున తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు, ప్రసంగాలు జరగనున్నాయి.

ఉత్తర ద్వార దర్శనం.. అనంత పుణ్య ఫలం

ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం ద్వారా విష్ణుమూర్తిని దర్శించుకుంటే అనంత పుణ్య ఫలం సిద్ధిస్తుంది. నియమ నిష్టలతో ఉపవాసం, జాగరణ, జపం, ధ్యానం చేయాలి. ఏకాదశి వ్రతాన్ని నిష్టగా ఆచరించడం సర్వ శ్రేయస్కరం. గీతా పారాయణం, గోవింద నామస్మరణ, పురాణ శ్రవణం మోక్షప్రాప్తి కలిగిస్తాయి.

– అగ్రహారం రాఘవేంద్ర ఆచార్యులు

కంటి శుక్లాన్ని నిర్లక్ష్యం చేయొద్దు



మహిళకు కంటి అద్దాలు అందజేస్తున్న డాక్టర్ జయప్రకాష్, రాయపాటి శ్రీనివాస్

కర్నూలు(హాస్పిటల్): కంటి శుక్లం సమస్యపై నిర్లక్ష్యం వహించరాదని కంటి వైద్య నిపుణులు డాక్టర్ జయప్రకాష్ అన్నారు. బాల సాయిబాబా జయంతిని పురస్కరించుకుని బాలసాయి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బాలసాయి పాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి వైద్యనిపుణులు డాక్టర్ జయప్రకాష్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. డిజిటల్ స్క్రీన్ ముందు ఎక్కువ సమయం గడపడం వల్ల కంటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అస్పష్టమైన దృష్టి, కళ్లు పొడిగా మారడం, కళ్లు తరచూ ఎర్రబడటం, తలనొప్పి రావడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కంటి వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ రంగనాయకులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



మాదన్న

కర్నూలు కల్చరల్: క్లస్టర్ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) ఆర్థిక శాస్త్ర అధ్యాపకుడు టి.మాదన్న డాక్టరేట్‌ను పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి తెలిపారు. మిడ్తూరు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన టి.మాదన్న రాజస్థాన్‌లోని అల్వార్ సైన్‌రైజ్ విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గౌరవ సింఘాల్ పర్యవేక్షణలో 'పట్టణ పేదరిక నిర్మూలన పథకాల అమలు, వాటి ప్రభావాలపై ప్రజల అవగాహన - ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నగరంపై పరిశోధన' అనే అంశంపై విస్తృతమైన పరిశోధన చేయడంతో పీహెచ్‌డీ డిగ్రీని పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి, అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు. గత 23 సంవత్సరాలుగా ప్రభుత్వ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తూ, పరిశోధనపై మక్కువతో ఈ అంశంపై పరిశోధన చేశానని, తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని మాదన్న పేర్కొన్నారు.

మరణించి ఇద్దరికి వెలుగు



నేత్రాలను అందుకుంటున్న ఐ బ్యాంక్ టెక్నీషియన్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని వెంకటాద్రినగర్‌కు చెందిన రామాయణం భ్రమరాంబ(65) అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. ఆమె మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శోభన్‌బాబు, ఐ డొనేషన్ కమిటీ చైర్మన్ గోనూరు యుగంధర్‌శెట్టిలు భ్రమరాంబ కుటుంబ సభ్యులను నేత్రదానానికి ఒప్పించారు. ఈ మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఐ బ్యాంక్ టెక్నీషియన్లు వచ్చి నేత్రాలను సేకరించారు.

వైభవంగా రేపల్లె వేడుకలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో ధనుర్మాస పూజల్లో భాగంగా గురువారం రేపల్లె వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను గోదా గోకులం మాడ వీధుల్లో ఊరేగిస్తూ గోదా రంగనాథ స్వామి ఆలయంలోకి చేరుకోవడంతో వేద పండితులు శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సామూహికంగా తిరుప్పావై పాశురాలను పారాయణం చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు పాతబస్తీలోని ఎర్రబురుజులో నివాసముంటున్న సందెపోగు భార్గవి (32) ఆత్మహత్య చేసుకుంది. ఈమె భర్త సతీష్ కర్నూలు కార్పొరేషన్‌లో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నాడు. పదేళ్ల క్రితం వీరికి వివాహమయ్యింది. కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా భార్గవి అనారోగ్యంతో బాధ పడుతుండేది. గురువారం మధ్యాహ్నం బిస్కెట్లు తెచ్చుకోమని పిల్లలను బయటకు పంపి తలుపులు బిగించుకుని చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. అనారోగ్య కారణాల వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఒకటో పట్టణ పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

దిశ వన్‌స్టాప్ సెంటర్ పరిశీలన

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని దిశ వన్‌స్టాప్ కేంద్రం, మహిళా ప్రాంగణం (శక్తిసదన్)లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి గురువారం పరిశీలించారు. కార్యాలయాల రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. దిశ వన్‌స్టాప్ సెంటర్ ప్రాంగణం ఆవరణలో కాలువ నీటి అపరిశుభ్రత కారణంగా సంబంధిత అధికారి శుభ్రపరుచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. శక్తిసదన్, వన్‌స్టాప్ సెంటర్‌లోని వారికి లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులని తెలిపారు. డీసీపీఓ శారద, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఎన్‌సీడీ 3.0 సర్వేలో భాగంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ శైలేష్‌కుమార్ చెప్పారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చరర్స్ గ్యాలరీలో హైరిస్క్ ప్రెగ్నెన్సీపై వార్డు, గ్రామ మహిళా ఆరోగ్య కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్లు దాటిన వారందరికీ రక్తపోటు, మధుమేహం, రక్తహీనత పరీక్షలు, 30 ఏళ్లు దాటిన వారికి రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను ఇంటింటికీ వెళ్లి చేయాలని సూచించారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. డీపీహెచ్‌ఎన్‌ఓ కె.అన్నపూర్ణ, స్టేట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ప్రశాంత్, పీహెచ్‌ఎన్ మీనాక్షి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, ఎంపీహెచ్‌ఈఓ మూర్తి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో గిరిజన సాంస్కృతిక ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో రాజమండ్రి నన్నయ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న గిరిజన సాంస్కృతిక మహోత్సవాల కరపత్రాలను గురువారం క్లస్టర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఒక భాగంగా ఉన్నాయన్నారు. వాటిని పరిరక్షించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు జాతీయ స్థాయిలో గిరిజన సాంస్కృతిక మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, టీఎస్ఎఫ్ నాయకులు రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం, పాలక మండలి వైఫల్యంతోనే తొక్కిసలాట

కర్నూలు (టౌన్): తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందిన ఘటనపై కూటమి ప్రభుత్వం, టీటీడీ పాలక మండలి పూర్తి బాధ్యత వహించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించేందుకు కనీసం అంబులెన్స్ డ్రైవర్లు లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అమాయక భక్తులు చనిపోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తోందని పేర్కొన్నారు. భక్తులకు కనీస ఏర్పాట్లు చేయలేని టీటీడీ బోర్డు రాజీనామా చేయాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలని, బాధితుల ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మృతుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తరఫున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

తిరుపతి తొక్కిసలాట ఘటన బాధాకరం

కర్నూలు(సెంట్రల్): తిరుపతిలో తొక్కిసలాటలో ఆరుగురు చనిపోవడం అత్యంత బాధాకరమని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, టీటీడీ బోర్డు సరైన చర్యలు తీసుకోకపోవడంతోనే తొక్కిసలాట జరిగిందని విమర్శించారు. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

➡ తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు చనిపోవడం, 30 మంది తీవ్రంగా గాయపడడం బాధాకరమని, ఈ ఘటపై విచారణకు ఆదేశించాలని ఎస్‌యూసీఐ జిల్లా ఇన్‌చార్జ్ వి.హరీష్‌కుమార్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్‌చేశారు. టీడీపీ చైర్మన్, ప్రభుత్వం టోకెన్లను పంపిణీ చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని చెబుతున్నారని, అయితే ప్రమాదం ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఈ ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి

కర్నూలు కల్చరల్: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైష్ణవ కరుణానిధిమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్లస్టర్ పాఠశాలలను చూసుకునే బాధ్యతలు కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లకు కేటాయిస్తుండటంతో వారిని గ్రేడ్-1 హెడ్ మాస్టర్లుగా మార్పు చేయాలన్నారు. ఆ పాఠశాలల్లో గ్రేడ్-2 హెడ్‌మాస్టర్ల పోస్టులను ఏర్పాటు చేయాలని కోరారు. పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల్లో చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్న టీజీటీ, పీజీటీకు మినిమం టైంస్కేల్ వర్తింప చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్లు బాబూరావు, సుదర్శనం, ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోలింగ్ ట్రోఫీ అవార్డు గ్రహీతకు సత్కారం



ఏపీ రోలింగ్ ట్రోఫీ విజేతను సత్కరిస్తున్న సీఐడీ అధికారులు

కర్నూలు: రాష్ట్ర సీఐడీ విభాగంలో మొదటిసారిగా ప్రారంభించిన రోలింగ్ ట్రోఫీ అవార్డును దక్కించుకున్న పి.ప్రసాదరావు టీమ్‌కు ఘన సత్కారం లభించింది. స్థానిక వెంకటరమణ కాలనీలోని సీఐడీ కార్యాలయంలో సహోద్యోగులంతా ప్రసాదరావు టీమ్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఉత్తమ నేర పరిశోధకుడిగా కర్నూలు సీఐడీ రీజనల్ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రసాదరావును హెడ్ క్వార్టర్స్ అధికారులు 2024 రోలింగ్ ట్రోఫీకి ఎంపిక చేశారు. ఈ మేరకు ఆయన గత సంవత్సరం డిసెంబర్ 30న హెడ్ క్వార్టర్ మంగళగిరి కార్యాలయంలో అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక కార్యాలయంలో డీఎస్పీ దైవప్రసాద్ ఏపీ రోలింగ్ ట్రోఫీ విజేత అయిన ప్రసాదరావు టీమ్ ఎస్ఐ ఉస్మాన్ ఘని, హెచ్‌సీ నాగేంద్రబాబు, పీసీ షఫి, ధనుంజయను సత్కరించారు. సీనియర్ డీఎస్పీ వహీద్ బాషా, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌తో పాటు పలువురు సీఐలు పాల్గొన్నారు.

20 నుంచి మళ్లీ రీ సర్వే ప్రారంభం కావాలి



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు (సెంట్రల్): జిల్లాలో ఈనెల 20వ తేదీ నుంచి రీ సర్వేను ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు కింద రీ సర్వే గురించి జిల్లాలోని ఆర్ఎస్‌డీటీలు, మండల సర్వేయర్లకు, డిప్యూటీ తహసీల్దార్లకు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాల్లో 25 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసుకుని సర్వేను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆర్‌డీఓల ఆధ్వర్యంలో రీ సర్వేపై ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని జేసీ ఆదేశించారు. ప్రతి గ్రామంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామ సరిహద్దులను గుర్తించి గ్రామంలోని అన్ని ప్రభుత్వ భూములను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే అధికారి మునికన్నన్, ఆర్ఎస్‌డీటీలు, మండల సర్వేలకు, డిప్యూటీ తహసీల్దార్లకు తదితరులు పాల్గొన్నారు.

రోల్‌బాల్ పోటీలు ప్రారంభం



రోల్‌బాల్ పోటీలో తలపడుతున్న జట్లు

కర్నూలు (టౌన్): నగర శివారులోని లక్ష్మీపురం వద్ద ఉన్న రిడ్జ్ పాఠశాలలో గురువారం సాయంత్రం 16వ జాతీయ జూనియర్ రోల్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రోల్‌బాల్ పోటీల్లో దేశంలోని 20 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నట్లు చెప్పారు. రోల్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు జి.చంద్రమౌళి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు పోటీలు ఉంటాయని తెలిపారు. సీఈఓలు గోపీనాథ్, సౌమ్య, ప్రిన్సిపాల్ రాజ్‌కమల్, నిర్వాహకులు సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతిబింబాలు పండుగలు



హరిదాసుకు ధాన్యం వేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: మన సంస్కృతి సంప్రయాలను ప్రతిబింబింపచేసేవి పండుగలని సర్వేపల్లి విద్యా సంస్థల అధినేత శేషన్న అన్నారు. కృష్ణానగర్‌లోని పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భోగిపళ్లతో విద్యార్థులను ఆశీర్వదించారు. భోగిమంటల చుట్టు సందడి చేశారు. ముత్యాల ముగ్గులు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు అరుణశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

– ఆదర్శ విద్యా మందిర్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. హరిదాసు కీర్తనల పోటీలు జరిగాయి. విజేతలకు విద్యా సంస్థల చైర్మన్ బి.తిమ్మయ్య బహుమతులను అందజేశారు. డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

కర్నూలు(సెంట్రల్): బిర్లాగేటు పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ఎన్‌ఏసీ శిక్షణ కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పి.దీప్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎల్ఐసీ, అమరాజా కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని చెప్పారు. 15 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని, విద్యార్హత జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందని వెల్లడించారు.

నేటి నుంచి నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్: కళా సౌరభ 10వ వార్షికోత్సవం పురస్కరించుకొని శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జాతీయస్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీ నటరాజ నృత్య కళా మందిర్ నిర్వాహకులు కరీముల్లా తెలిపారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. పోటీలో మొదటి రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు, మిగతా రెండు రోజులు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పోటీలు ఉంటాయని వెల్లడించారు.

మున్సిపల్ పాఠశాలలో ప్రవేశాలకు పరీక్ష

కర్నూలు కల్చరల్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో 6వ తరగతిలో అన్ని సీట్లు, 7వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షను మార్చి 8వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిలబస్‌తో నడుపుతున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశ పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 21 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని, మార్చి 8న పరీక్ష, ఏప్రిల్ 9న ఫలితాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. పాఠశాలలోనే దరఖాస్తులు పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ రిజర్వేషన్ నియమాల ప్రకారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 5 మార్కులు అదనంగా కలపడం జరుగుతుందని పేర్కొన్నారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు తెలపండి

కర్నూలు (సెంట్రల్): జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, గ్రేడ్ వన్ వీఆర్వోలకు త్వరలోనే సీనియర్ అసిస్టెంట్లు/ఎంఆర్ఐలు పదోన్నతులు కల్పించనున్నారు. ఈ క్రమంలో ఆయా కేటగిరీ పోస్టుల సీనియారిటీ జాబితాను రూపొందించామని, వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లో తెలపాలని గురు వారం డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ ఓ ప్రకటనలో కోరారు. ఇందుకు సంబంధించిన జాబితాను కలెక్టరేట్‌తో పాటు ఆర్‌డీఓ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 23 మంది జూనియర్ అసిస్టెంట్లు/టైపిస్టులు, 16 మంది గ్రేడ్ వన్ వీఆర్వోలకు పదోన్నతులు లభించనున్నట్లు తెలుస్తోంది.

పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

కర్నూలు: కర్నూలు నగరానికి చెందిన ఓ నిందితుడికి పోక్సో కేసులో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కేసుల విచారణ న్యాయస్థానం తీర్పునిచ్చింది. స్థానిక బుధవారపేటకు చెందిన గౌండా (బేల్దారు) పనిచేస్తున్న బొగ్గుల రాజేష్ 2021లో అదే కాలనీలోని పదేళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, అసభ్యకర ఫొటోలు చూపిస్తూ మాట్లాడటంతో బాలిక తల్లి దండించగా క్షమాపణ చెప్పాడు. మళ్లీ కొద్ది రోజుల తర్వాత అదే సంవత్సరం జూన్ 23వ తేదీ ఎవరూ లేని సమయంలో బాలికను ఇబ్బందులకు గురిచేస్తూ బాధ పెడుతున్నట్లు బాలిక తల్లి ఫిర్యాదు చేసింది మూడో పట్టణ అప్పటి ఎస్ఐ రహంతుల్లా, మహిళా పీఎస్ ఎస్ఐ కొండయ్యలు దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి భూపాల్‌రెడ్డి నిందితుడు బొగ్గుల రాజేష్‌కు మూడేళ్లు జైలు శిక్ష, రూ. 20 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. స్పెషల్ పీపీలు వెంకటేశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దర్యాప్తు అధికారులు రహంతుల్లా, కొండయ్య, మూడో పట్టణ కోర్టు కానిస్టేబుల్ జాన్సన్ ఇమ్మానుయేలు, కిషోర్‌లను ఎస్పీ అభినందించారు.

ఘనంగా వార్షికోత్సవం



వేదికపై డీఈఓ శామ్యూల్ పాల్, అతిథులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని ఎడిఫై వరల్డ్ స్కూల్‌లో 3వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. వేడుకలకు ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్‌పాల్, ఎన్‌సీసీ 9ఏ గ్రూప్ కల్నల్ జోజి ఫిలిప్ పాల్గొని మాట్లాడారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పారితోషికాలు, ప్రశంసా పత్రాలను అతిథులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. స్కూల్ డైరెక్టర్లు మనోజ్, సతీష్, గాంధీరెడ్డి, ప్రిన్సిపాల్ జోసెఫ్ డేవిడ్, అబ్జర్వర్ లక్ష్మీ పాల్గొన్నారు.